వివాదాలకు కేరాఫ్ కేజీబీవీ

- సోమందేపల్లి స్కూల్‌లో తరచూ ఫుడ్ పాయిజన్
- సిబ్బంది మధ్య కొరవడిన సఖ్యత
- ఆందోళనలో తల్లిదండ్రులు


పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాల


నాణ్యత లేని ఉప్మా తయారు చేసిన దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాల వివాదాలకు కేంద్రంగా మారింది. బోధనా సిబ్బందితో పాటు అక్కడ పనిచేసే కొందరు ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాదాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయన్న ఆందోళన తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించడంలేదన్న విమర్శలున్నాయి.

264 మంది విద్యార్థినులు

సోమందేపల్లి కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ మొత్తం 264 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారికి నాణ్యమైన భోజనంతో పాటు ప్రభుత్వం కల్పించే తగిన సౌకర్యాలు సక్రమంగా అందడం లేదన్న విమర్శలున్నాయి. మంత్రులు, అధికారులు తనిఖీలు చేపట్టిన సిబ్బందిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడంతో పాఠశాలలో భోజనంతో పాటు సౌకర్యాలు వ్యక్తిగత సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉన్నాయి.

తరుచూ రచ్చకెక్కుతున్న సిబ్బంది

స్థానిక కస్తూర్బా పాఠశాలకు సంబంధించి నిత్యం సిబ్బంది మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు సీఆర్టీల మధ్య సఖ్యత లేకపోవడంతో బోధనేతర సిబ్బంది సైతం ఎస్‌ఓ మాట బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. గతంలో మాజీ మంత్రి శంకరనారాయణ, ప్రస్తుత మంత్రి సవిత పాఠశాలను తనిఖీ చేశారు. ఏకంగా మంత్రులకే విద్యార్థులు, సిబ్బంది ఫిర్యాదు చేయడంతో వారు రంగంలో దిగారు. పలువురు సస్పెండ్ కాగా మరి కొంతమంది పలుకుబడితో కొనసాగుతున్నారు. ఇదే పాఠశాలలో చదివిన కొందరు విద్యార్థినులకు బాల్యవివాహాలు కాగా కొన్ని నెలల క్రితం ఓ విద్యార్థిని పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి ఉరివేసుకోవడం సంచలనం రేపింది.

నాణ్యతకు తిలోదకాలు

కేజీబీవీలో విద్యార్థుల కోసం వండే ఆహార పదార్థాలకు సంబంధించిన వంట సిద్ధం చేయడానికి తీసుకొచ్చే ఆహార పదార్థాలు నాసిరకంగా ఉంటున్నాయని గతంలో విద్యార్థులు తల్లిదండ్రులు గగ్గోలు పెట్టారు. వాటిని తినలేక డస్ట్‌బిన్‌లో వేసిన ఫొటోలు అప్పట్లో వైరల్ అయ్యాయి. అదేవిధంగా ఆహార పదార్థాలు పక్కదారి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు.

నేలపై చికిత్స...

ఈ నెల 3న కస్తూరా పాఠశాలలో దాదాపు 70 మంది దాక విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. అయితే కనీసం ఆస్పత్రులకు రెఫర్ చేయకుండా తమకు సమాచారం ఇవ్వకుండా అధికారులు విషయం బయట పొక్కకుండా దాచి పెట్టారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పరిస్థితి విషమించడంతో 4న పాఠశాలకే వైద్య సిబ్బందిను పిలిపించి వైద్య పరీక్షలు చేయించారు. నేలపైనే పడుకోబెట్టి రెండు రోజుల పాటు చికిత్సలు చేయించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థినుల పరిస్థితి బాగాలేక, అప్పటికే బయటకు విషయం తెలియడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.


నేలపైనే విద్యార్థులకు వైద్యం అందిస్తున్న దృశ్యం (ఫైల్)

జాగ్రత్తలు తీసుకోవాలి



కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతతో పాటు వారి ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి. విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారంటే భోజనం పరిశుభ్రత ఉండడం లేదని తెలుస్తోంది. సిబ్బంది మధ్య గొడవలు లేకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– గౌతమి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు

క్లుప్తంగా

'పురం'లో సీపీఐ నాయకుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: ధర్మవరం పట్టణంలో ఈ నెల 31న సీపీఐ జిల్లా మహాసభల బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో సీపీఐ మహాసభల ర్యాలీను రహమత్‌పురం సర్కిల్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు చేపట్టి, అనంతరం పార్టీ జెండాను సీనియర్ నాయకులు జబీవుల్లా, రవి కుమర్‌లు ఆవిష్కరించారు. అంబేడ్కర్ భవనంలో సీపీఐ తాలుకా కార్యదర్శి వినోద్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా, వేమయ్య యాదవ్ మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభను జయప్రదం చేయాలన్నారు.

నేడు నేతులపల్లిలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

పరిగి: మండలంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7.30 ఎర్రగుంట పంచాయతీ పరిధిలోని నేతులపల్లిలో చంద్రబాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ కార్యక్రమంతో పాటు ఉషశ్రీచరణ్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హిందూపురం విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం ఉదయం 11:00 గంటలకు విజయవాడలోని గుణదల సీపీఎం కార్యాలయం గేటు నుంచి సీఎండీ చాంబర్ వరకు మోకాళ్ల మీద నడుచుకొంటూ వెళ్లి మెమొరాండం ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమానికి కార్మికులందరూ ఏకమై కదలి రావాలని పిలుపునిచ్చారు.

రాజీమార్గమే రాజమార్గం


మాట్లాడుతున్న న్యాయమూర్తి అశోక్‌కుమార్

హిందూపురం: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని ఇన్‌చార్జి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్, ప్రత్యేక న్యాయమూర్తి రమణ తెలిపారు. మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కేసుల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం, రాజీ పథక సంఘం ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా సమయం వృథా కాకుండా, వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు ఏమాత్రం చెడిపోకుండా ఉంటాయన్నారు. దీనిపై పునసమీక్షకు, అప్పీలుకు ఏమాత్రం అవకాశముండదన్నారు. ఇప్పటికే చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ఎన్నో కేసులు విజయవంతంగా పరిష్కారమయ్యాయన్నారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకొని కక్షదారులకు సమస్యను పరిష్కరించడంలో సహకరించాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు రామచంద్ర, నరసింహమూర్తి, భాగ్య, నౌరిన్‌తాజ్, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ అధికారుల సంఘం ఏర్పాటు


నూతన సంఘం సభ్యులు

పెనుకొండ రూరల్: జిల్లాలో నూతనంగా మండల పరిషత్ అధికారుల సంఘం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పెనుకొండ ఎంపీడీఓ నరేష్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పి.నరేంద్ర కుమార్, ఉపాధ్యక్షుడిగా సాయి మనోహర్, ప్రధాన కార్యదర్శి నరేష్ కృష్ణ, సహాయ కార్యదర్శిగా నసీమా, కోశాధికారి రఘునాథ్‌గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రామారావు, ఏవీ శ్రీనివాసులు, బాలకృష్ణుడులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


జడ్జి సోమశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రొద్దం: విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని, వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలని, చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని నెల్లూర్ల జిల్లా మహిళా కోర్ట్ జడ్జి సోమశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి సోమశేఖర్ పాల్గొని ప్రసంగించారు. జడ్జి మాట్లాడుతూ మెరుగైన జీవనోపాధి కోసం యువతను శక్తివంతంగా చేయడానికి ప్రతి ఏటా యూత్ స్కిల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు, వ్యవస్థాపకత కోసం యువకులను నైపుణ్యంతో సన్నద్ధం చేయాల్సిన అవసరాన్ని తెలియచేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

స్వచ్ఛ గ్రామాలుగా అభివృద్ధి చేయండి


రాళ్లపల్లిలో పర్యటిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

గుడిబండ: గ్రామాల్లో స్వచ్ఛతను కాపాడి అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సెంట్రల్ టీం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం రాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టి అపరిశుభ్రత తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. సెంట్రల్ టీం మేనేజర్ రామాంజినేయులు, ఈఓఆర్డీ నాగరాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించండి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం

అమరాపురం/మడకశిరరూరల్: అమరాపురం మండలంలోని హేమావతి, అమరాపురం, అలాగే మడకశిర మండలంలోని కదిరేపల్లి, గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం మంగళవారం తనిఖీ చేశారు. ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా తదితర విషయాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మందులు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కదిరేపల్లి పీహెచ్‌సీకి ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు ప్రవేశిస్తున్నాయని సిబ్బంది ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన

- జెడ్పీ ఛైర్‌పర్సన్‌పై జరిగిన దాడి పవన్‌కల్యాణ్‌కు కనిపించలేదా?
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక


చిలమత్తూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సమన్వయకర్త దీపిక, పార్టీ నేతలు

చిలమత్తూరు: 'రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోంది. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న కృష్ణా జిల్లా జెడ్పీ చెర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు చేసిన దాడి చేయడం పిరికిపంద చర్య' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం చిలమత్తూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని టీడీపీ అల్లరి మూకలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. జిల్లా ప్రథమ మహిళ అయిన జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను కూటమి రౌడీలు మద్యం సేవించి గంటన్నర పాటు వేధించడం దారుణమన్నారు. మహిళల గౌరవంపై ఊగిపోయి ఉపన్యాసాలు ఇచ్చే పవన్ కల్యాణ్ కంటికి ఈ ఆడబిడ్డ పడిన ఇబ్బందులు కనిపించలేదా అని ప్రశ్నించారు. నిందితులపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు రివర్స్‌లో కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కులశేఖర్‌రెడ్డి, మహిళా విభాగం నేతలు కవితారెడ్డి, షాజియా, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, పార్టీ నేతలు గిరిధర్‌రాజు,సుధాకర్‌రెడ్డి, చిన్నప్పయ్య, లక్ష్మీపతిరెడ్డి,అన్సర్ అహ్మద్, దామోధర్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి , ప్రణయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

సీఎం చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరిద్దామని, ఆ దిశగా ప్రతి కార్యకర్త గ్రామాల్లో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక పిలుపునిచ్చారు. అక్రమంగా పెట్టిన కేసులపై న్యాయ పోరాటం చేద్దామన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. దీపిక మాట్లాడుతూ.. శుక్రవారం స్థానిక విరాట్ ప్యాలెస్‌లో 'బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించి క్యూఆర్‌కోడ్ ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి పిలుపునిచ్చారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి


మాట్లాడుతున్న నరసింహరావు

గోరంట్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహరావు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ సంఘం జిల్లా రెండో మహాసభ గోరంట్ల పట్టణంలోని మాధవరాయ దేవాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. నరసింహారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు చేయకతప్పదని హెచ్చరించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశు, పెనుకొండ నియోజవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, మండల కార్యదర్శి మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

రొళ్ల: మండల పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా పెట్టాలని మడకశిర రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. తొలుత రికార్డులను పరిశీలించారు. తర్వాత కేసుల వివరాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులు ఏమైనా ఉంటే సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరాంజనేయులు, కానిస్టేబుల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నష్టాలపై అవగాహన

అగళి: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ వార్డెన్ సికిందర్ బాషా ఆధ్వర్యంలో అగళి ప్రజలకు ప్లాస్టిక్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

20న సీపీఐ మహా సభలు

పెనుకొండ: పట్టణంలో నియోజకవర్గస్థాయి సీపీఐ డివిజన్ స్థాయి మహాసభలు ఈ నెల 20న నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలు నేరం

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బాలికలకు బాల్య వివాహాలు చేయడం చట్టారీత్యా నేరమని సీడీపీఓ గంగరత్న, ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఏఓ విశ్వేశ్వర ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న అంబులెన్స్

పరిగి: మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభాన్ని అంబులెన్స్ ఢీకొట్టిన ఘటన చోటు చేసుకుంది. అనంతపురం నుంచి మండలంలోని శ్రీరంగరాజుపల్లికి మృతదేహాన్ని బంధువులు తీసుకొస్తున్నారు. అయితే పరిగి మండల కేంద్రంలోని 90 ఇండ్ల ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన కట్టేసిన గేదెలను తప్పించబోయి దగ్గర్లోని విద్యుత్ స్తంభాన్ని అంబులెన్స్ ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి పోగా విద్యుత్ వైర్లలో సరఫరా నిలిచిపోయింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతు చేపట్టారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



అగళి: మండల పరిధిలోని కసాపురంలో మారెమ్మదేవికి జ్యోతుల మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉపవాస దీక్షలు చేసి జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

సంక్షిప్త సమాచారం

నేడు మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ జన్మదిన వేడుకలు బుధవారం ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని మడకశిరరోడ్డులోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ,మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

అంబేడ్కర్ స్మృతి వనం పరిశీలన

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో దళితులు నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ స్మృతి వనంలో ప్రహరీ, డిజిటల్ లైబ్రరీ నిర్మాణ పనులను పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. స్మృతి వనానికి రూ.17 లక్షల ఎంపీ నిధులు మంజూరైనట్లు చెప్పారు. అదేవిదంగా అమరాపురం బస్టాండులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి, జిల్లెదుగుంట గ్రామాల్లో మంగళవారం ఏఓ తిమ్మప్ప, సిబ్బందితో కలిసి మొక్కజొన్న పంటకు సోకిన చీడపీడలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.

ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

అమరాపురం: ఉమ్మడి జిల్లాలో ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ ఏను పునరుద్ధరించాలని కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షాకు పోస్టు కార్డుల ద్వారా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నట్లు ఉదుగూరు ఆర్డీటీ అభిమానులు తెలిపారు. ఈ నెల 16 నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలాల్లో 1600 పోస్టు కార్డులను కేంద్ర హోం మంత్రికి పంపనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని డీబీ కాలనీలో రిటైర్డ్ ఎల్ఐసీ ఆఫీసర్ నరసింహారెడ్డి భార్య ఉషమ్మ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి ఉషమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సామర్థ్యాలను నైపుణ్యాలుగా మార్చుకోవాలి

అగళి: పుట్టుకతోనే మనలో ఉండే సామర్థ్యాలను అవకాశం వచ్చినప్పుడు నైపుణ్యాలుగా మార్చుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని మంగళవారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

సీఎం పర్యటనకు స్థల పరిశీలన

పావగడ: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ నెల 21న వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నిర్వహించడానికి పావగడలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీ లాబూ రామ్ నేతృత్వంలో పోలీసు ఉన్నతాధికారుల బృందం మంగళవారం పావగడకు చేరుకున్నారు. సీఎం సభ ఏర్పాటు చేసే మహాత్మాగాంధీ స్టేడియాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై సమీక్షించారు.

రేపు మారెమ్మదేవి జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మదేవికి గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.